కథానిక:

# పాలపొంగు

శ్రీ రా॥ సీ॥ ఆంజనేయశాస్త్రి

"నేను గజనీ యింటికెళుతానండి" అంది సయీదా బన్సీలాలుతో వేడినిట్టూర్పు విడుస్తూ. మొహంమీద చిరుచెమట బిందువులు పొటమరించాయి. తల ఒంచుకు నుంచుంది బన్సీలాలు మొహంలోకి చూడలేక. ఆదివారం అవటంచేత బన్సీలాలు విశ్రాంతిగా కూర్చున్నాడు, సాయంత్రం పూట మేడమీద ఏదో పత్రిక చదువుకుంటూ. కిషన్‌లాలు టెన్నిస్ ఆడుకుంటానని కెళ్ళాడు. సీతకు పడిశంపట్టడంవల్ల తన గదిలో పడుకుంది. తను ఒంటరిగావున్నప్పుడు ఒచ్చి యీమాట చెప్పాలని సయీదా అవకాశంకోసం వెదికి పట్టుకున్నట్లుగా బన్సీలాలుకు యిట్టే అర్థమయింది ఆమె వైఖరివల్ల. టెన్నిసు ఆడుతూ ఆడుతూవుండగా హఠాత్తుగా గూడు పట్టడంవల్ల కిషన్‌లాల్ యింటికొచ్చి పేరిన నేతితో తోమించుకుందామని నౌకరుతో సహా మేడమీదికొస్తుండేసరికి చూసి తండ్రి బన్సీలాలు సైగచేస్తూ వారించాడు రావద్దని. ఎవరో అని సయీదా వెనక్కి తిరిగిచూసేసరికి బుజంమీద తుండుగుడ్డమాత్రం వేసుకుని నివ్వెరపోయిచూస్తున్న కిషన్‌లాల్ కనిపించాడు. వెనకాల నేతిగిన్నె పుచ్చుకు నుంచున్న నౌకరున్నాడు. ఆమె ఒళ్లంతా ఆవిర్లు తేలినట్టయింది. తల తిప్పేసుకుని ఒకడుగు పక్కకేసి నుంచునే వుంది. కిషనూ, నౌకరూ కిందికెళ్లిపోయారు. క్షణమాత్రంలో జరిగిన యీఘటనను ఆవరించుకుంటూ కూర్చున్న గంభీరమౌనాన్ని భంగపరస్తూ "మేజర్లు నా అనుజ్ఞ తీసుకోవాల్సిన అవసరంలేదు." అన్నాడు బన్సీలాల్.

చిన్నప్పటినుంచీ సయీదాకు బన్సీలాల్ అంటే ఎంతచనువో, అంత భయంకూడాను. పెద్ద పిల్లఅయిన కొద్ది చనువు క్రమంగా తగ్గి భయం అధికమవుతూ ఒచ్చింది. పిల్లా జెల్లా అంతా కలిసికూర్చుని కబుర్లు చెప్పుకునేటప్పుడు ఎంత అరమరిక లేకుండా మాట్లాడినా ఒంటరిగా వెళ్ళి, మాట్లాడటానికి ఆమె జంకుతూనే వుంది. మరీ యీ రెండు మూడు రోజులనుంచీ ఆమె పడేవ్యథ - ఆ జంకుని మరింతచేసింది. సరిగ్గా అప్పుడే కిషన్ రావడం, తండ్రిసైగమీద వెళ్ళిపోవడం చేత అది రెట్టింపైంది. బన్సీ చెప్పిన జవాబువల్ల అది అనంతమై సయీదాను కబళించి వేసింది. బన్సీ తననింత దూరంలో వుంచుతాడని ఆమె అనుకోలేదు "ఎందుకమ్మా, అలా అంటున్నావు!" అని అడుగుతాడనీ, అప్పుడు తన మనస్సులోవుండే భావాల్ని చెబుదామనీ,ఆ మీదట అన్నీ సమసిపోతాయనీ, అసలు తను గజనీ యింటికెళ్లే అవసరమే వుండదనీ సయీదా అనుకుంది. ఎన్నో విషయాలు చెప్పినతర్వాత "నేను గజనీ యింటికెళు"తాననే మాట చివరికనాల్సింది. కాని మొదట్లోనే అనేసరికి బన్సీలాలు మనస్సు కూడా బయటపడింది. అయితే మరి "నేనుమాత్రం సయీదా అనే అంటాను నా కోడల్ని" అని ఎందుకంటాడు బన్సీలాల్ ఆరోజున? అందుకు జవాబు ఆలోచించే అవకాశం ఆక్షణంలో కనిపించలేదు సయీదాకు. తనదే అనుకున్నవస్తువు, తనది కాకుండాపోతుందనేసరికి ఆవస్తువుమీద యింత తేలిక భావం కూడా పుడుతుందికామాలు! సయీదాకు యిదివరకు తోచిన అవమానమే యిప్పుడు ధ్రువపడినట్టయింది. అవమానం యిట్టే ఆగ్రహాన్నికూడా కలిగిస్తుంది. ఆమె తలెత్తి బన్సీలాల్‌కేసి సూటిగా చూస్తూ కొంచెం తడబడుతూనే "శుక్రవారంవరకూ యిక్కడ వుండటానికనుజ్ఞ యివ్వండి. గజనీకి కబురుచెయ్య

దానికీ దానికీ..." అర్ధోక్తిలోనే బన్సీలాల్ అందుకుని "అన్ని రోజులుకూడా పట్టవు ఆపనికి... కాని..." మళ్లీ అర్ధోక్తిలోనే సయీాదా కోప భారంతో కుములుతున్నట్టుగా "...ఒక్క క్షణంకూడా ఆగక్కర్లేదు... కాని నా తండ్రిమరణం నన్ను తప్పనిసరిగా మీా శరణు వేడేటట్టు చేస్తోంది." అంది. తననింత నిర్లక్ష్యం చేస్తూ సయీాదా మాట్లాడటం బన్సీలాలు ఆత్మగౌరవానికి గొడ్డలి పెట్టయినట్టయింది. మతంలో యింత మాదకతవుంటుందని అతనెప్పుడూ అనుకోలేదు. అందులోనూ తన బాల్యస్నేహితుడు గులాం మహమ్మద్ కూతురు సయీాదా, తనకూతురు సీతతో పాటు కాదూ పెరిగింది. ఏడాదివయస్సునుంచీ తనింట్లోకి పండగపబ్బాలలోనూ, కార్యకరాదుల్లోనూ హిందూబాలికల్లే తనింట్లో వారితో ఎలా కలిసిపోయేది? గులాం మహమ్మద్‌ను ఒక మహమ్మదీయుడే హత్య చేశాడని తెలుసుకుని సయీాదా ఆనాడు శాంతిసంఘం ఎదుట ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడింది తన రక్షకుడుగా వచ్చిన హంతకుని అన్నగారు గజనీతోటి? ఇప్పుడూ గజనీయింటికే వెడతానంటోంది! మతం మనిషిగుండెల్ని చంపేస్తుంది! ఇన్ని భావాలూ యిట్టే పరిగెత్తాయి అతని మెదడులో. తనుచేసిన లోపం ఏమన్నా వుందా? అనే ఆలోచన అతనిని కసలెప్పుడూ తట్టదు. సయీాదా విషయంలో అసలే తట్టలేదు యిప్పుడు.

"శరణు వేడాల్సిన అగత్యం నీకేమీా లేదు. నీ కభ్యంతరం లేకపోతే మోటారులో యిప్పుడే గజనీ యింట్లో నిన్ను దింపించి వచ్చే ఏర్పాటు చేస్తాను." అన్నాడు బన్సీలాల్. సయీాదా వెక్కి వెక్కి ఏడుస్తూ "అలా చేస్తే నా మానాన్ని కాపాడిన వారవుతారు." అంది. బన్సీలాల్‌కు కూడా కోపం వచ్చిందా మాట వినేసరికి. "నేను చేసినదంతా నీ మానభంగానికే తోడ్పడితే చచ్చి స్వర్గానున్న మా గులాం నన్ను క్షమించకపోడు. అతని కూతు రెక్కడైనా సరే సుఖంగా ఉండటమే అతనికి సంతోషం. అతని సంతోషమే నా కానందం" అని దూకుడుగా అంటూ బన్సీలాల్ డ్రైవరుకు కబురుచేసి సయీాదాను అప్పుడే గజనీ యింటికి పంపించాడు మోటారులో.

౨

ఔరంగజేబు పాదుషా లాగా దిండు కానుకుని దర్బారులో కూర్చుని వున్నాడు గజనీ తన మేడ రెండో అంతస్తులో. నెత్తిమీాది పాగా తీసివుంచాడు. గనక నున్నటిగుండు, తలలోని కుట్రల కన్నిటికీ ఒక్క చర్మపు తెరను మాత్రం వేసి తెలుసుకోగలిగిన వాళ్ళని తెలుసుకునేట్టు చేస్తోంది. గులాం మహమ్మదును హత్యచేసిన తన తమ్ముడు సయ్యాద్‌తో మాట్లాడుతున్నాడు మర్నాడు గల వాయిదా విషయమై. తమ్ముడిని బెయిలుమీాద విడిచిపెట్టినప్పటినుంచీ, నిరపరాధిగా నిర్ణయించి సయ్యాదుమీాది కేసు కొట్టేయించేందుకు కావలసిన కార్యాలన్నీ గజనీ మనస్ఫూర్తిగా చేస్తున్నాడు. జడ్జి హిందువూ, ముస్లిమూ కాకుండా క్రిస్టియ నవడంవల్ల ఎట్టి ప్రమాదమూ రాదని ప్రభుత్వం నిర్లక్ష్యంగా వుంది. ఆ నిర్లక్ష్యాన్ని, జడ్జీగారి మతాన్ని దుర్వినియోగ పరచుకోటానికి గజనీ హిందూముస్లిం శాంతిసంఘసభ్యత్వం చక్కని సదుపాయం కలగజేసింది. ఆ సభ్యత్వపు హోదాలో గజనీ, జడ్జీగారితో బాగా పరిచయమూ, చనువూ ఏర్పరచుకున్నాడు. బంగారు చెప్పుతో కొట్టటానికికూడా అతను వెరవలేదు, లూటీచేసిన సొమ్ము బోలెడంత వుంది కనక. జడ్జీగారి సలహామీాదే సయ్యాదును నెలకోమాటో, రెండుమాట్లో పిచ్చెక్కినట్లు నటించే ఏర్పాట్లుచేశారు. హిందువుల్లే పిలక పెట్టి విభూతి, రుద్రాక్షలూ గాని గంధాక్షితలుగాని ధరించడం, ఆ పిచ్చి చేష్టల్లో ప్రధానమైనది. ఆ చేష్టచేసే సమయాన కనిపించిన సాయబునల్లా పట్టుకుకొట్టబోవటం ముఖ్యం. అలా కొట్టబోతున్నప్పుడు బంధువు లతన్ని పట్టుకుని కొట్లో బంధించాలి. రెండురోజు లయింతర్వాత పిచ్చి తగ్గిపోతుంది కనక విడిచిపెట్టాలి." ఇలా రెండేళ్ళ క్రితం సయ్యాదుకు మతిభ్రమణం కలిగింది. అప్పుడు లతీఫ్ అనే మౌల్వీ గారిని కొట్టడంవల్ల సయ్యాద్ బంధువులు అతన్ని కొట్లో బంధించారు. నాలుగు నెల లదే విధంగా ప్రతిపూర్ణిమకూ, అమావాస్యకూ అతనికి మతిభ్రమణం కలగటంచేత హిందువులు చేసిన చేతబడి, భూతప్రేత ప్రయోగాలవల్ల యీా అనర్థం వచ్చినట్లు నిశ్చయించుకుని దానికి నివారణ చేయగా

తగ్గిపోయింది. ఆ తరవాత మళ్లీయిలాంటి చిత్తభ్రమణం కలగలేదు. కనక ఎట్టి నిరోధము లేకుండా సయ్యదు తిరుగుతున్నాడు. ఇప్పుడు మళ్లీ అటువంటి జబ్బే అకస్మాత్తుగా చెయ్యడమూ, దురదృష్టవశాత్తూ గాలీబు వంటి మహామహుడే చంపబడటం జరిగింది." చక్కని కథ అల్లాడు గజనీ. అందుకు సాక్ష్యాధారాలు కూడా పోగుచేశాడు. లతీఫ్ చెప్పవలసిన సాక్ష్యానికి "రిహార్సల్సు" గజనీయింట్లోనే జరిపే ఏర్పాటు కూడా అయింది. సయ్యదు తరఫున పనిచేసే ప్లీడరు రజాఖాన్ ఒక బారెట్లా. ఆయన స్వయంగా వచ్చి లతీఫ్ "రిహార్సలు"ను నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ప్లీడరు వెళ్లబోతుండగా యింకా వెక్కి వెక్కి ఏడుస్తూనే సయీదా వచ్చింది సావిట్లోకి. తోడేళ్ల గూడెంలోకి గొర్రెపిల్ల తలదాచుకుండానికి వెళ్లినట్లు.

గజనీ తనకళ్లని తానే నమ్మ లేకపోయాడు. సయ్యదు స్తబ్ధుడై నుంచున్నాడు. "ఇంత అందమైన హిందూ స్త్రీ ఎందుకేడుస్తూ యిక్కడికొచ్చింది" అని సంభ్రమాశ్చర్యాలతో లతీఫూ, ప్లీడరు రజాఖానూ నిర్ఘాంత పోయి చూస్తున్నారు. క్షణమాత్రంలో గంభీరముద్ర దాల్చి – వెంటనే మందహాసాన్ని బుద్ధిపూర్వకంగా ఆహ్వానించి.

"నిన్ను వెళ్లగొట్టాడు కదూ బన్సీలాల్?" అన్నాడు గజనీ. ఆ మాటనేసరికి అందరికీ తెలిసిపోయింది ఆమె సయీదా అని.

సయీదా గద్గదికతో అంది "నేనే, మీయింటికొస్తానని ఆయనతో చెప్పా"నని.

"అయితే బన్సీలాల్ అపరాధం మరీ ఘోరమైందన్నమాట!" అన్నాడు గజనీ మందహాసాన్ని మింగుతూ.

"బాగా చెప్పారు." అన్నాడు ప్లీడరు. లతీఫ్ నిజం అన్నాడు. సయ్యద్ సయీదాను నేత్రాలతో తాగేస్తున్నాడు మాట లేమీ వినకుండా. గజనీ సైగమీద ప్లీడరులు, లతీఫులతోబాటు సయ్యదూ బైటికెళ్లిపోక తప్పలేదు.

"అల్లా నిన్ను రక్షించాడు. నువ్వు బద్దన్నా, నీ తండ్రి మరణానికి నిజంగా చింతించే మనిషి యీ ప్రపంచంలో, నేనొక్కడినేనని నువ్వు యిప్పటికైనా నమ్మినందుకు నాకు సంతోషంగావుంది..." అనేసరికి గజనీ, బావురుమంది పాపం సయీదా. గజనీ లేచి నుంచుని ఆమె వీపు తట్టుతూ "తండ్రి లేని లోపం తీర్చడం మానవుని కసంభవం. కాని శాయశక్తులా నేను నీకు ఎలాంటి లోపమూ లేకుండా చేస్తాను. నువ్వారోజున మాతో ధిక్కరించి చెప్పిన మాటలకు నేను ఎంత దుఃఖించినానో అల్లాకే తెలుసు..." అని సముదాయించాడు. శాంతి సంఘంలో జేరిం తర్వాత గజనీ యిలా లజ్జుగా మాట్లాడటం యిట్టే నేర్చుకున్నాడు. సయీదా ఏమీ సమాధానం చెప్పలేదు. పరమ కిరాతకుడనుకున్న గజనీలో యింత సత్వగుణమూ, తన తండ్రి గులాం మహమ్మద్ మరణంపట్ల యింత సంతాపమూ, తాను నిర్లక్ష్యంగా పదిమందిలోనూ "ముస్లిం మతం మీద నాకు ఆస్థలేదు, ముస్లింలని పేరుపెట్టుకున్న మీమూలంగా, ఈ ఘాతుకమృగాల మధ్యకి రావటంకన్నా నేను ఆత్మహత్య చేసుకోటం మేలు." అన్నందుకు గజనీకి కలిగిన దుఃఖమూ, అలా అన్నంతనే అనాథఅయి అతని యింటికొచ్చినప్పుడు అతను చూపిన ఆదరమూ, సయీదాను స్నేహం బుధిలో ముంచి లేవనెత్తాయి. 'ఎందుకొచ్చా?' వని కారణమన్నా అడక్కుండా గజనీ ఆమెను తన కుటుంబంలో కలిపేసుకున్నందుకు సయీదా కృతజ్ఞతకు మేర లేకపోయింది.

గజనీభార్య జేబున్నిసా పూర్వకాలం మనిషి. చదువు సంధ్యలూ ప్రపంచజ్ఞానమూ ఏమీలేదు. కాని మనిషికుండాల్సిన హృదయంమాత్రం వుంది. ముస్లిం మతాచారాలు ఫలానా అని తెలీవుగాని స్త్రీలు ఘోషాలో వుండాలని మటుకు ఆమెకి బాగా తెలుసు. వయస్సులోవున్న సయీదా అలా ఘోషాలో లేకపోవడం కెంతో అవమానం కలిగినట్టయింది. సయీదా కట్టుకూడా ముస్లింలవలె కాకపోవడం ఆమె సహించలేకపోయింది. ఇదంతా హిందువుల మధ్యవున్న పాపంవల్ల సంభవించిన అనర్థమని ఆమె మందబుద్ధికట్టే తోచింది. బుద్ధిపూర్వకంగా ఒక ముస్లిం వనిత నిలా పాడుచేసినందుకు బన్సీలాల్ కుటుంబంమీద ఆమెకు కోపంకూడా వచ్చింది.

హృదయమిచ్చి మాట్లాడిన జేబున్నిసాలో మరణించిన తన తల్లిరూపాన్ని ఊహించుకుని ఉప్పొంగి

పోయింది సయీదా. ఆమెకోరిక ప్రకారం వేషం మార్చటానికి కష్టమనిపించలేదు. ఘోషాలోవుండటం ఎంతమాత్రం యిష్టం లేకపోయినా జేబున్నిసాను సంతోషపెట్టటానికయినా ఘోషాలో వుండటం తన ధర్మం అనుకుంది సయీదా. కాలేజీ మాన్పించమని చెప్పే అవసరం యింకా రాలేదు. తండ్రి పోయిన దుఃఖంవల్ల సయీదాయే యింకా కాలేజీ సంగతాలోచించలేదు కనక. మాంసాహారం అలవాటు లేదని తెల్సుకుని జేబున్నిసా, సయీదాకోసం ప్రత్యేకం శాకాహారం చేయించేది. ముస్లిం మతాచారం ప్రకారం గులాం మహమ్మద్‌కు చేయవలసిన అపరకర్మలన్నీ యథావిధిగా చేయించే ఏర్పాటు గజనీస్వయంగా చేశాడు. మనిషి మనస్సు అతి మెత్తన నవనీతంకంటెకూడా; దాంట్లో మార్పొస్తే ప్రతిచిన్నవిషయమూ బ్రహ్మాండమంత సంతోషాన్నో దుఃఖాన్నో కలిగిస్తుంది. పరిస్థితుల కనుగుణంగా భావాల్నీ నడతల్నీ మార్చుకుంటుంది. ఇదివరకు ఎంతో ఉదారంగా కనబడిన మనుష్యుల్ని ఉదాత్తమనిపించిన ఘటనలనూ యిట్టే ఏవగించుకుంటుంది. ఇంతవరకు మామూలుగా మాటవరసన అన్న పలుకులే కంటకాలై గుచ్చుకుంటాయి. లోగడ మనుష్యులు చేసిన ప్రతి పనీ స్వార్థంతోనూ, కుత్సితబుద్ధితోనూ జేసినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. కొంతకాలానికయినా అలాంటి మనుష్యుల విషవలయంలోంచి తప్పించుకు రాగలిగినందుకు తన్ను తా నభినందించుకుంటుంది. తాను పరమరాక్షసుడని తలచిన మనిషిలోనె దైవోపమ గుణాలున్నాయని కొంతకాలానికైనా గ్రహించగలగటం తన అదృష్టమని నమ్ముతుంది. ఆ మనిషివిషయమై తన ఆప్తులు చెప్పిన దుర్గుణాలు, అబద్ధమేమోనని అనుమానిస్తుంది. కాని యిలాంటి మార్పే మళ్లా తనకి వస్తుందేమోనని మాత్రం ఆ మనసుకు ఆలోచనపోదు అప్పుడు.

## 3

రాత్రి భోజనాలైంతర్వాత గుడ్డివెన్నెలలో పైడాబామీద తమలపాకు లేసుకుంటూ కూర్చున్నప్పుడు బన్సీలాలే ఆ విషయమై "సయీదా వెళ్ళటంవల్ల యిల్లంతా చిన్నబోయి నట్టుంది." అంటూ ప్రస్తావించేవరకూ ఎవరికీ "సయీదాను ఎక్కడికి పంపించారు? ఎందుకు?" అని అడిగే సాహసం లేకపోయింది. సీతకు తెలుసు యీ విషయమై రాత్రి ప్రస్తావన జరుగుతుందని. అందుకని ఒంట్లో అంత బాగుండకపోయినా, పడిశం తగ్గటానికి ఆవిరి పట్టి మిరియాలు పొడివేసిన పావుశేరు ఆవుపాలు మాత్రం తాగి, నలుగురితోపాటు పై డాబామీది కొచ్చింది. తండ్రి సందిచ్చేవరకూ మాట్లాడటానికి భయమే కాని సందిచ్చినప్పుడు చాలా స్వతంత్రంగానూ ఒక్కొక్కప్పుడు నిర్లక్ష్యంగా మాట్లాడుతుందేమోనని అనిపించేట్లు కూడా సంభాషించడం సీతకు మొదటినుంచీ అలవాటే.

"మీరే పంపించారుగా?" అంది సీత నిష్ఠూరం వేసినట్లు. "నేను గజనీయింటి కెళుతానండి అని సయీదా మొట్టమొదటి వాక్యంలోనే స్పష్టంగా చెబితేను!" అన్నాడు బన్సీలాలు.

"ఆవిడ కిష్టంలేదు గజనీయింటి కెళ్లటం" అని ఖచ్చితంగా చెప్పింది సీత. తండ్రీ కూతురూ మాట్లాడుతుంటే సాధారణంగా యింట్లో వా రెవరూ అందుకోరు. కిషన్‌లాలూ అంతే.

"అయితే అలా ఎందుకంటుంది నాతో?" అని ప్రశ్నించాడు బన్సీలాల్. "ఎందుకు? అని మీరడుగుతారని..." అంది మహా తెలిసినట్టు సీత.

"నా అనుజ్ఞ తీసుకో నక్కర్లేదు మేజర్లు... అన్నా నేను." అని చెప్పాడు బన్సీలాల్.

"అలా దూరంగా కొట్టేసినట్లు మాట్లాడుతారని ఆవిడ అనుకునుండదు." అందిసీత.

'ఏమోమరి, "శుక్రవారంవరకూ వుండటానికనుజ్ఞ యిప్పించండి. గజనీకి కబురు చేయటానికీ దానికీని..."అని సయీదా అంటే "ఆపనికి అన్ని రోజులుకూడా పట్టవు..."అని నే నన్నా'...బన్సీలాల్ పూర్తిచేయకముందే "సరేలే అని మీరంటే యిలా జరిగేది కాదు." అని సీత తన అభిప్రాయం చెప్పింది.

"నువ్వూ సయీదా ముందే మాట్లాడుకుని వున్నట్టున్నారే!" అన్నాడు వ్యంగ్యంగా బన్సీలాల్.

వివరంగా అలా మాట్లాడుకుని వున్నా, కనీసం వెళ్ళేటప్పుడు నాకు కనుపించినా యింతపని జరిగేది కాదు." అనేసింది సీత.

'"ఒక్క క్షణం కూడా ఆగక్కర్లేదు. కాని నాతండ్రిమరణం నన్ను తప్పని సరిగా మీ శరణు వేడేటట్టు చేస్తోంది." అని సయీదా అనేసరికి నాకూ కష్టమనిపించి "శరణు వేడాల్సిన అవసరం నీకేమీ లేదు. నీ కభ్యంతరం లేకపోతే యిప్పుడే గజనీయింట్లో నిన్ను దింపించి వచ్చే ఏర్పాటు చేస్తాను." అన్నా.'

"అని బన్సీలాల్ తాంబూలం వేసుకోటం పూర్తిచేశాడు.

ఇలా సయీదా మాట్లాడటం సీతకీ ఆశ్చర్యం వేసి నా అవమానంగా కనిపించినప్పుడల్లా మాట్లాడటం సహజమేనని సంతృప్తిపడి "కన్నతండ్రితో సమానంగా పెంచిన మీరే అలా అన్నప్పుడావిడ కెంత వ్యథకలిగిందో పాపం" అని సానుభూతి చూపింది.

"అలాచేస్తే నా మానాన్ని కాపాడిన వారవుతారు." అని సయీదా అనే సరికి నాకు ఒళ్లు భగ్గుమంది. అన్నాడు బన్సీ లేచి నుంచుని. కిషన్ ఉలిక్కిపడ్డటం సీతమాత్రం గమనించింది. ఆ సంగతి తెలుసుకున్న కిషన్ సీత వేపుచూసి తలొంచుకున్నాడు. ఇదేమీ గమనించని బన్సీలాల్ పూర్తి చేశాడు. "నేను చేసిందంతా నీ మానభంగానికే తోడ్పడితే చచ్చి స్వర్గానున్న మాగులాం నన్ను క్షమించకపోడు."

"ఆవిడ ఏడవ లేదండీ పాపం మీ రలా అన్నప్పుడు...?" అని ప్రశ్నించింది సీత.

"ఏడవ కేం?...నాకూ కొంచెం జాలేసి, "అతనికూతు రెక్కడైనా సరే సుఖంగా వుండటమే అతనికి సంతోషం. అతనిసంతోషమే నా కానందం." అన్నా నేను." అంటూ యింతసేపూ మౌనంగా కూర్చున్న కొడుకు వేపు చూశాడు బన్సీలాల్ సయీదాతో తను మాట్లాడేటప్పుడు ఆక్షేపంలో కిషన్ విషయం గుర్తు రాకపోవడం ఎందుకనో? అనుకుంటున్నట్టుగా. సీతకూడా "నువ్వు చెప్పాల్సింది చెప్పవేం?" అన్నట్లుగా అన్నగార్ని ప్రశ్నించింది కళ్లతో.

"ఆఁ...ఏదో ప్రాప్తం వున్నన్నాళ్లుంది. తింది, తిరిగింది. మనసు మారేసరికి పోయింది. ఇంతకీ మతం ఒకటి కాదుకదా! మావాళ్లు అంటూనే వున్నారు... అయిపోయిందేదో అయిపోయింది... ఎందుకూ దీనిని కింత పెద్ద తర్జన భర్జన కూడాను.?" అంటూ బన్సీలాల్ భార్య ప్రతిమాదేవి తమ దానశీలతా, సయీదా దుర్దశ, తమవారి మతాభిమానమూ, అన్నీ ముక్తసరిగా మూడు మాటల్లో వెళ్లగక్కింది.

"అలా అనకు అమ్మా... ఆవిడ మనస్సు నీకు తెలీదు." అంది మందలించినట్టుగా సీత.

"మహా తెలుసు లెద్దూ నీకు అందరి మనస్సులూనూ?...గడ్డొచ్చి పిల్ల వెక్కిరించినట్టు మాట్లాడుతావు...ఈ యింగ్లీషు చదువులూ నువ్వూ...అసలు నేను..."—అర్థోక్తిలోనే బన్సీలాల్ అందుకుని "సరేలే, నీది పాతపాటేగా ఆడపిల్లలికి చదువు లక్కర్లేదని...కలిసిమెలిసి తిరుగుతారు కనకా, ఒకేయీడు కనకా, సయీదా మనస్సు సీత కెక్కువ తెలిస్తే ఆశ్చర్యమేముంది?..."అని కూతుర్ని సమర్థించాడు పచారుచేస్తూ. క్షణమాత్రపు నిశ్శబ్దం కిషన్‌లాల్‌ను కలవరపరిచింది. అతను చెప్పక తప్పలేదు, "నేనైనా ఆ అమ్మాయితో కొత్తగా అన్నదేమీ లేదు..." అని. బన్సీలాలు కొంచెం తీవ్రంగా తలతిప్పి, కిషన్ మొహంలోకి గంభీరంగా చూస్తూ"...పాతగా అన్నదేమన్నా వుందేమిటి?" అని ప్రశ్నించాడు. తప్పంతా అన్నమీదే కాకుండా, కొంత తండ్రిమీదకూడా వేద్దామనో యేమో సీత అందుకుని అంది "ఆరోజు మీరు "నేనుమటుకు నా కోడల్ని సయీదా అనే అంటాను." అని అన్నప్పటినుంచీ సయీదా అదోమాదిరిగా వుంది" అని. ఆ మాట వినేసరికి బన్సీలాల్ పచారుచేస్తున్నవాడల్లా కుర్చీలో కూర్చుని"...నాకు చెప్పలేదేంమరి మీ రెవరూను? అవునూ గులాం భార్య నాకు చెల్లెలు వరస. సయీదా మేనకోడలు. అందుకని అన్నాను...." అంటూ ఆ పైన ఏమైంది? అన్నట్లు కొడుకు వేపు చూశాడు. "కాని.. మీకు ఆ ఉద్దేశం వుందని నే ననుకొని..." కిషన్ నీళ్లు నమిలాడు. "అంటే?." నన్నాడు మొహం చిట్లించి కూతురు వేపుచూస్తూ బన్సీలాల్. సీతకు సిగ్గేసింది. తండ్రితోనూ, అన్నతోనూ, ప్రేమా, పెళ్ళివిషయాలు చెప్పటానికి. చెక్కిళ్లు ఎర్రబడ్డాయి. కొంచెం ఉష్ణ నిశ్వాసం విడుస్తూ, తన విషయం కాదుకదా అని సిగ్గును పక్కకినెట్టి "ఆవి

డను పెళ్ళిచేసుకుందామని అన్నయ్య ఉద్దేశం నాన్నగారూ..." అనేసింది. కిషన్ మాట్లాడ లేదు.

"తురకదానితో పెళ్ళేమిటే?" అని అరిచింది బన్సీ భార్య. ఆ మాట నేసరికి ముగ్గురికీ చాలా కష్టం వేసింది.

"ఉత్తమం మధ్యమం లేకుండా మాట్లాడ కమ్మా!" అని సీత కసిరి కొట్టినట్టుంది. కిషన్ కోరగా చూసి వూరుకున్నాడు. బన్సీలాల్ "కుక్క మొరిగినట్లు మొరగటమేనా?" అని చీవాట్లే పెట్టాడు.

"మీ చదువులూ మీరూ, మీ మాటలూ మీరూ, మీ బుద్ధులూ మీరూ...నన్నెప్పుడూ దాసీ దానిగానే చూస్తారు...ఇంతకీ నా కర్మం..." అంటూ గుడ్లనీళ్లు తుడుచుకుంటూ లేచింది ప్రతిమా దేవి. ఇలాంటి సాధింపులూ, కన్నీళ్లూ అలవాటే కనక ఎవరూ లక్ష్యపెట్టలేదు.

సయీదాను తన కొడుక్కు చేసుకుంటే ఎంతో బాగుంటుందని బన్సీలాల్ చాలా ఏళ్ళనుంచీ అనుకుంటూ వుండేవాడు. ఆమె రూపురేఖలు, బుద్ధివైశద్యమూ, ఆచార వ్యవహారాలూ, చదువు సంధ్యలూ, అన్నీ అన్నివిధాలా తమ దర్జాకీ వంశానికీ అనుకూలంగానే వుండటం అందుకు దోహద మిచ్చింది. కాని మతం వేరవడం ఒక ఆన కట్టలాగా అడ్డంగానే వుంది. అందుకనే కామాలు గులాం మహమ్మద్ ఆ వుద్దేశం వున్నట్లెప్పుడూ కనపరచలేదు. రెండుమూడు ముస్లిం సంబంధాలు రావటం విషయంగూడా గులాం తనకి చెప్పేవాడు. తనే అడుగుదామని ఒకటి రెండుసార్లు అనుకున్నాడు గాని, యింత డబ్బూ యింత గొప్ప వంశమూ, తాను వరుని తండ్రి అవటమూ ఆ ప్రయత్నానికి వెంటనే నిరోధంచేశాయి. అదీగాక కుమారుని ఉద్దేశంకూడా కనుక్కోవాలి. తీరా కనుక్కున్న తర్వాత, అతను యిష్టపడితే, గులాంను "ఏం బావా, మీ అమ్మాయిని మా అబ్బాయి కిస్తావా?" అని అడిగే తీరాలి సొస్తుంది. కనక కిషన్‌తోకూడా ఆ ప్రస్తావన ఎప్పుడూ చెయ్యలేదు బన్సీ. తీరా అంతా ఒప్పు కున్నా భిన్నమతస్థులమధ్య వివాహ సంబంధం ఎలా సమకూడుతుంది? పోనీ మతం మార్చుకుంటే? ఆ అమ్మాయీ, గులామూ మార్చుకుంటే సరిపోతుంది. కాని గులాం అలా మార్చుకునే మనిషి కాదు. ఇప్పుడు సయీదామాత్రం మార్చుకుంటే చాలు. కాని ఆమెకూ మైనార్టీ వెళ్లింది. ఆమె ఉద్దేశా లెలా వుంటాయో! ఇప్పుడ డగాల్సిన సమయం కాదు. తండ్రిపోయి యింకా నెలన్నా తిరక్కముందే. ఇన్ని భావాలూ బన్సీలాలు మనస్సులో పుట్టి పెరిగి విరిగి పోయాయి. కాని తన సమ్మతి లేకుండానే కిషన్ సయీదాను పెళ్లిచేసుకో దలుచుకోటం, అందుకు తాను సమ్మతించానని అర్థం చేసుకుని ఆమెను కిషన్—ఏమి చేశాడో బన్సీకింకా తెలి యలేదు. కాని అతనికి కోపమే ఒచ్చింది. అంతకు ముందసలు సయీదా ఉద్దేశం ఏమిటో తెలుసుకో వాలి కనక సీతనే అడిగాడు తండ్రి "సయీదాకూ అలాంటి ఉద్దేశంవుందా?" అని. సీత యిదమిద్ధంగా ఏమీ చెప్పలేకపోయింది. ఇదివరకు వేళాకోళంగా ఏకాంతలోవున్న సమయాన ఒకటి రెండుసార్లు సయీదా "ఒదినా, మీ కిషన్‌గారేమంటారో మరి యివాళ సినిమా కెళ్లటం విషయంలో?" అనీ "ఒదినెగారి కిష్టం లేక పోతే అన్నగారు మాత్రమేం చెయ్యగలరు?" అనీ సీత అంటే, కిలాకిలా నవ్వి సయీదా సీత బుగ్గమీద చిటికివేసి తుర్రున పారి పోయింది. అంతే తప్ప కోపగించుకోలేదు. అందు వల్ల ఆవిడకూ యిష్టమేనేమో ననుకుంది. ఈవిష యమై యింకా లోతుగా ప్రస్తావించటాని కామె అవకాశం యివ్వలేదు. కాని గులాం మహమ్మద్ మరణించిన తర్వాత ఆమె తన మనసు మార్చుకుం దేమోననిపించింది. లేకపోతే గజనీయింటి కెందు కెళ్లిపోతుంది?

"ఆవిడకీ యిష్టమే నని నేను మొదట్లో అను కున్నాను. కాని తరవాత..." సీత సందేహించింది చెప్పటానికి. అన్న మొహంలోకి చూచేసరికి కిషన్ లేచి కిందికెళ్లాడు. బన్సీకి ఆగాటం ఎక్కువైంది. "చెప్పెయ్యి సీతా...ఫరవాలేదు. చెప్పవమ్మా..." అన్నాడు. సీత సందేహిస్తూ తడబడుతూ సిగ్గుతో చెప్పింది... "మీ రామాట అన్న సాయంత్రం అన్న క్లబ్బు కెళ్లకుండా తోటలో కూర్చున్నాడుట ఒంటరిగా. నేనూ, అమ్మ పక్క వాళ్లింటికి పేరం టానికెళ్లాం. వాళ్లు మరీ పట్టుపడితే, సయీదా కేమీ తోచక తోటలోకి వెళ్లిందిట. తోట మాలీ లిద్దరెళ్లారు.

అన్నయ్య సయీదాదగ్గిరికొచ్చి "మా నాన్నకి కూడా యిష్టమని యివాళ తెలిసింది కదా! నా ఉద్దేశం నీకు చాలా కాలం కిందటే తెలిసివుంటుందనుకుంటాను. నీ కభ్యంతరం వుండదని నాకు తెలుసు..." అంటూ చెయ్యి పట్టుకుని దగ్గిరగా లాక్కుని..." యిహ చెప్పలేకపోయింది సీత. బన్నీలాల్ గుడ్లెఱ్ఱజేసి "ఇహ తెలిసిందిలే తల్లీ... తెలిసింది... చెప్పక్కర్లేదు... కిషన్ యింత దుర్మార్గుడని నేను కలలో కూడా అనుకోలేదు..." అని గర్జించాడు "కిషన్!" అంటూ.

"వా డేమీ చెయ్యలేదు మానభంగాలు. ఆమాంధాత, మీతో అన్నట్లు... ముద్దుమాత్రం పెట్టుకున్నాడుట. ఏమీ అభ్యంతరం పెట్టకపోవడం చేత... వాడే చెప్పాడు నాతో. అంతలో ఎక్కెక్కి ఏడుస్తూ పరిగెత్తుకుని లోపలికి పోయిందట... తరవాత ఆవిడా యీవిడగారూ ఒకటే గుసగుసలు!..." అని ప్రతిమ స్పష్టంగా చెప్పేసింది వయస్సుమళ్లిన మనిషవటం చేత... "నేనూ చివాట్లేశాను వాడిని 'తురకదాంతో నీకు సరసమేమిట్రా?' అని... అంటే యింత కోపమూ సిగ్గూ వచ్చాయి వాడికి... మీ దాకా రానక్కర్లేదు యీమాత్రం భాగ్యానికి... ఇంతకీ పోనే పోయిందిగా పీడ విరగడై?..."

బన్నీలాలుకు భార్యమీద యీమాటు కోపం రాలేదు. కూతుర్నడిగితే "అమ్మ చెప్పిన విషయమే సయీదా కూడా నాతో చెప్పింది." అంది. కిషన్ భయపడుతూ వచ్చాడు. "నీకూ పశువుకూ భేదం లేదు." అన్నాడు బన్నీ. "వెంటనే పంపిస్తే నా మానాన్ని కాపాడినవా రవుతారని పాపం సయీదా విలపించినప్పుడు నా యింట్లో ఒక మదించిన దున్న పోతుందని నా మందబుద్ధికి తట్టలేదు." కిషన్ కన్నీరు కార్చాడు. "నా పశుత్వాన్ని నే నంగీకరిస్తాను. కాని ఆమె వైఖరి నన్ను వారించలేదు. మీ పలుకులు నన్నుత్సాహితుణ్ని చేశాయి." అన్నాడు తలొంచుకునే.

"అయితేమటుకు? చిన్నప్పటినుంచీ యింట్లో పెరిగిన పిల్లని, అవివాహితని, తండ్రిలేని పిల్లని, విమతస్థురాల్ని... మన అధీనంలో వుందిగదా అని...? నీ చెల్లెల్ని... మరొకరిల్లా..." అర్థోక్తిలోనే భార్య అందుకుని "అపశకునం మాటలు రానియ్యకండి. ఆ గతి శత్రువుకు కూడా పట్టక్కర్లేదు" అంది.

"నాకు నీమీద యింకా ఎక్కువగానే అనుమానం వుంది... సయీదాను యింకా బాధించావేమోనని..." అని బన్నీ మరోపోటు పొడిచాడు. "దైవసాక్షిగా చెబుతున్నా... అమ్మతో చెప్పినదే ముమ్మాటికీ సత్యం. అంతకుమించి నేను సాహసించలేదు." కిషన్ పశ్చాత్తాపంతో అన్నాడు.

"చేసిన పని తప్పు గానట్టు..." అని ఎద్దేవీగా అన్నాడు బన్నీ.

"ఏమండీ మరోమనిషిగా వుండేది వుంటే... వాడికేం పెళ్లి కాకపోతుందా? పసినెధవని నానా చివాట్లూ పెడుతున్నారు యిందాకటి నుంచీ చూస్తున్నా... గురివిందగింజ తన నలుపెరగదని... చదువులూ. సంఘాలూ, షికార్లూ, సినిమాలూ... ఎందుకుంచారూ ఆ పిల్లని?... పంపెయ్యక పోయారూ ఆయనచచ్చిన మర్నాడు ఏతురక వాడింటికో?..." అని బాదించింది భార్య. బన్నీలాలు ఇంగ్లండు వెళ్లినప్పుడొక ఆంగ్ల వనితతో సంబంధం పెట్టుకున్నాడు. ఇండియాకు తీసుకొద్దామని కూడా ప్రయత్నిస్తే నలుగురూ చివాట్లేసేసరికి ఆవిడకు పాతిక వేల రూపాయలు పంపించి రాజీ చేసుకున్నాడు. ఇండియాలో అప్పటికే బన్నీ వివాహమైంది. ఈవిషయాన్ని ఎత్తుకునే ఆమె దెప్పిపొడుస్తోందని బన్నీ తెలుసుకుని గమ్మున ఊరుకున్నాడు. సయీదాను తేలికపరుస్తూ అన్నమాటలన్నీ సీతకు కూడా పొడుచుకుంటూనే వున్నాయి. పట్టలేక "చదువుకున్న వాళ్లెవరూ నువ్వనుకున్నట్లు ఉంపుడుకత్తెలుగా వుండటాని కంగీకరించరు." అని తల్లితో అనేసింది సీత. "ఉండకపోతే లేచిపోతారిలాగే..." నంది తల్లి.

"ఇహ ఊరుకోండి..." అన్నాడు బన్నీ.

"ఆమాట నేను మొదట్లోనే చెప్పాను..." అని భార్య జవాబిచ్చింది. అంతా వెళ్లిపోయినా బన్నీలాలు మటుకు ఒంటరిగా పచారు చేస్తూనే వున్నాడు మరోగంటసేపు.

## ౪

సయీదా వెళ్లిన మర్నాడే గజనీ తన నౌకర్ని బన్నీలాలింటికి పంపించాడు సయీదా పెట్టెలూ

బట్టలూ, డబ్బూ, గులాం ఆస్తీ అంతా పంపించవలసిందిగా ఉత్తరంరాసి. బన్నీలాల్ వారి యావదాస్తీ బ్యాంకులోవున్న ౫౦ వేల రూపాయల కాతాతో సహా గజనీ యింటికి పంపించేశాడు సాయంత్రానికి. తనకుమారునివల్ల జరిగిన తొందరపాటుని మన్నించమనీ, తన మాటలలో గల ఉద్దేశాన్ని ఫలానా అనీ గజనీకి తెలియపరుద్దామనుకున్నాడు గాని "నిజానికి తెలియపరచవలసింది సయీదాకు. ఇతరులకీ విషయం తెలిస్తే మరీ విషమిస్తుంది." అని భావించి ఊరుకున్నాడు బన్నీ.

పదిహేనురోజు లయింతర్వాత సయీదా కాలేజీ కెళదామని అనుకుని బండీ పిలుచుకు రమ్మంది నౌకరుని. వాడు గజనీతో చెప్పాడు. గజనీ స్వయంగా వచ్చి "వయస్సువచ్చిన ఆడపిల్లలకు చదువు పనికి రా"దని బోధించాడు. సయీదా వాదించింది. తన డబ్బు పెట్టేకదా చదువుకునేది అనికూడా అంది. ఆఖరికి గజనీ ఆమెను ముస్లింస్త్రీల కాలేజిలో ప్రవేశ పెట్టడాని కంగీకరించి యిదివరకటి కాలేజీనుంచి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్టు తెప్పించాడు. సీత కలవకుండా వుంటుంది కనక కాలేజీ మార్పుకు సయీదాకూడా యిష్టపడింది. సీతతోనన్నా చెప్పకుండా వచ్చినందు కామె బాధపడుతూనేవుంది.

గులాం సామానంతా అమ్మేసి ఆ డబ్బు సయీదా కాతాన బ్యాంకులో జమకట్టించాడు గజనీ. ఆ సంగతి సయీదాకు బ్యాంకునుంచి డబ్బు తెప్పించినప్పుడు అక్కౌంటు పుస్తకంలోవున్న జమవల్ల తెలిసింది. గజనీయందు డబ్బు విషయమైకూడా యింత నిజాయితీ వుండటం ఆమె కాయనమీద మరింత గౌరవం కలగజేసింది. తన చదువేమో పుస్తకాలేమో తప్పితే సయీదాకు యితరపను లేమీ లేవు. గజనీకి పిల్లలు లేకపోవడంవల్ల యిల్లు బావురుమంటూ వుండేది. బన్నీలా లిల్లు పిల్లా, జెల్లాతో కలకల లాడుతూండటంవల్ల మొదట్లో యిక్కడ ఏమీ తోచేదికాదు. గాని, కాలేజీ స్నేహితురాళ్లు వస్తూండటంచేత తరవాత తరవాత బాగానే వెళ్ళిపోయేవి రోజులు...ఆరు నెలలు గడిచాయి.

ఓరోజు జేబున్నిసాతో మాట్లాడుతున్నప్పుడు "ఆయనమీద కేసు కొట్టేస్తే భగవంతుడి దయవల్ల, ఆయనా ఓ యింటివాడయి నీ కడుపు చలవవల్ల నలుగురు బిడ్డల్ని నువ్వుకూడా కంటే అదే చాలు నాకు...నాకు లేనేలేరు పిల్లలు..." అంది ఎంతో ప్రేమతో. సయీదాకు సరిగా తెలీలేదు. కాని ప్రాణా లెగిరిపోయినట్టయింది. "ఎవరిమాట మీరంటోంది?" అంది అమాయకంగా.

"నీమాటే తల్లీ, మా మరిది సయ్యాద్ మాటాను. ...కేసు కొట్టేస్తేకాని పెళ్ళిచెయ్యనని వారు మొన్నకూడా నాతో అన్నారు...అదీ మంచిదేలే..." అంది జేబున్నీసా. ఒక నిమిషం ఏమీ అనకుండా వూరుకుని తన భావం చెప్పాలి కనక..."మా నాన్నని హత్యచేసింది మీ మరిదేనని మీకు తెలుసా?" అని ప్రశ్నించింది.

"ఆఁ ఆఁ. అవో చెడ్డరోజులు. నిజంగా మీ నాన్నలాంటి సత్పురుషులు మహా అరుదు. నీలాంటి మంచిపిల్లలుకూడా అరుదే. ఎందుకంటే అలాంటి దుర్మార్గం జరిపినాయన అన్నగారినే నువ్వు శరణు వేడావు...రేపు ఆ సయ్యదునే..." మాట పూర్తి కాకముందే సయీదా అందుకుని "నేను పెళ్ళి చేసుకోను..." అంది స్పష్టంగా. "శరణు వేడావు" అనేమాట ఆమెను శూలమల్లె పొడిచింది.

"పిచ్చితల్లీ! మన మతంలో ఆడపిల్లలకు పెళ్లి చేసుకోకుండా వుండ రాదమ్మా" అందిజేబున్నీసా సయీదా వీపు తట్టుతూ అతి ఆప్యాయంగా...

"నేను ఆయన్ని చేసుకోనంటున్నా..."అని యింకా స్పష్టంగా చెప్పింది. సయీదా. "అలా అనకు తల్లీ, వారి ఉద్దేశ్యం కూడాఇదే." అంది జేబున్నీసా. సయీదా దూకుడు గానే అంది "అయినా సరే!" నని. అని చివాల్నలేచి తనగదిలో కెళ్లి దిండు తడిసిపోయేట్టు ఏడుస్తూ మంచంమీద పడుకుంది బోర్లగిలా.

సయీదా గజనీతో మాట్లాడటం అరుదు, ప్రత్యేకం పనుంటే తప్ప. ఆ సాయంత్రం పనిపెట్టుకుని సయీదా గజనీని కలుసుకుని తలొంచుకు నుంచుంది. "ఏమమ్మాయి యిలా ఒచ్చావు. కులాసాగా వుంటోందా?..." అని ప్రశ్నించాడు గజనీ. సందేహించకుండానే చెప్పింది సయీదా... "...ఆఁ...పిన్నిగారి వాళ నా పెళ్లిప్రసంగం తెచ్చి

మీతమ్ముడికి నన్నియ్యదలచినట్లు చెప్పారు..."అని. గజనీ గడ్డం సవరించుకుంటూ విషపు నవ్వు నవ్వాడు. ఆయన మొహం పరికిస్తూ సయీదా "మీ ఉద్దేశం కూడా అదేనని పిన్నిగారు చెప్పారు..." అంది. గజనీ మరో నవ్వు నవ్వాడు. "నే నా యన్ని చేసుకోనని స్పష్టంగా పిన్నిగారితో చెప్పేశాను." అంది సయీదా. గజనీ గంభీరంగా చూశాడు సయీదా మొహంలోకి.

"నా పితృహంతకుణ్ని నేను భర్తగా స్వీకరించాలని మీ రుండదనుకుంటాను." అని మళ్లీ అంది సయీదా.

"అతణ్ని ఎల్లుండి విడిచి పెడుతుంది కోర్టు. నిర్దోషి అని తీర్మానించి..." అని గజనీ అన్నాడు.

"కోర్టుకు కళ్లు లేకపోయినా నాకున్నాయి. ప్రపంచాని కున్నాయి." అంది సయీదా రోషం కొంచెం చూపిస్తూ.

"నిన్ను చేసుకునే షరతుమీదే నీతండ్రిని వాడు వధించాడు. వాడిపని వాడు పూర్తిచేశాడు. మిగతా పని నిర్వర్తించడం నావిధి..." అని గజనీ నన్ను పెద్దవి చేసి చెప్పాడు.

"ఆసంగతి నాకు తెలుసు!" అంది సయీదా మరింత వేగంతో.

"అయినా యిక్కడి కొచ్చావు..." అని వ్యంగ్యంగా అన్నాడు గజనీ. కుత్సితంగా చూస్తూ ఇలాంటి క్రూరత్వం గజనీలో ఆమె ఎప్పుడూ చూడలేదు.

"బుద్ధి పొరపాటయింది..." అంది సయీదా కోపావేశంతో.

"మళ్లా మళ్లించుకోకు...అసహాయవు..." అని ఎత్తిపొడిచాడు గజనీ గడ్డం సవరించుకుంటూ. సయీదా బావురుమంది. దుఃఖంలోనూ, ఆగ్రహంలోనూ, అవమానంలోనూ, ప్రేమలోనూ, — అన్నిట్లోకూడా ఆడదాని కేడుపే శరణ్యం కామాలు! గజనీ చలించలేదు. మరింత తీవ్రతతో "అనాథవు పైదీవికూడాను... వాడినే చేసుకు తీరాలి... ఇది ఏకైకముస్లిం నాయకుడు గజనీ ఆజ్ఞ... ఈమాట ఎల్లుండి చెపుదామనుకున్నా...ఇవాళే చెప్పాలి సొచ్చింది..." అని అక్కడనుంచి వెళ్లబోయాడు.

"కాని, హృదయంగల మనిషిని. నాబొందిలో ప్రాణం వుండగా యీపని జరగదు" అని ఏడుస్తూనే చెప్పి లోపలి కెళ్లిపోయింది సయీదా.

— గజనీ ఓడిపోయాడు. "నీకంత సుతరామూ యిష్టం లేకపోతే ఆ సంబంధం చెయ్యరనీ, కాని ఆ సంబంధం చేసుకోవటంవల్ల సుఖంవుందని సయీదాకు నచ్చజెప్పమనీ" ఆరాత్రి భార్య జేబున్నిసాకు గజనీ చెప్పాడు రహస్యంగా.

౨

అనుకున్నట్లే జడ్జిగారు సయ్యదును విడుదల చేశారు. ప్రభుత్వం అప్పీలు చేద్దామనుకునేసరికి శాంతి సంఘసభ్యుని హోదాతో గజనీ ప్రధాన మంత్రి దగ్గరికీ, ప్రధాన కార్యదర్శిదగ్గరికీ వెళ్లి "గులాం మహమ్మద్ కూతురు సయీదాను బన్సీలాల్ పెట్టిన బాధలు అపరిమితం. వాటిని భరించలేక ఆమె మా యింటి కొచ్చేసింది. కేసు కొట్టేయ్యగానే సయ్యదును వివాహమాడి సుఖించ గోరుతోంది. సయ్యదును శిక్షించినా గులాం తిరిగిరాడు. కనీసం ఆయన కూతురు సుఖంగాఉంటే ఆయన ఆ లోకంలోంచి అయినా సంతోషిస్తాడు. అదీగాక అప్పీలు చేసి సయ్యదును శిక్షించడంవల్ల శాంతంగావున్న సంఘంలో మళ్ళీ కల్లోలాలు బయలుదేరవచ్చు." అని కొంత సామరస్యమూ, కొంత అబద్ధమూ కొంత బెదిరింపూ, కొంత శాంతి ప్రియత్వమూ చక్కగా కలిపి చెప్పాడు. ప్రభుత్వం అప్పీలు చెయ్యలేదు.

ఇకముందు మతి భ్రమణం కలిగితే జాగ్రత్తగా వుంచుతామనే పూచీకత్తూ, అందుకు కావలసిన డబ్బూ, సయీదా పేరనే కోర్టులో కట్టించాడు గజనీ పోర్జరీచేసి. ఈకథంతా విన్నవాళ్లు పరిపరివిధాలా భావించసాగారు. "సయీదా పితృహంతకుణ్ని పరిణయమాడుతుందంటే, ఆమెకీ సయ్యదుకీ పూర్వ పరిచయమే వుండి వుంటుంది. బన్సీలాలు కొడుకేదో అక్రమం చేయడంవల్లనే ఆమె గజనీయింటికి పారిపోయిందేమో! పట్టపగలు హత్యచేసినా యీ కలికాలంలో శిక్షలేదు. పైగా హంతకుడినే వధింపబడినవాడి పుత్రిక వివాహంచేసుకుంటుంది...ఎంత మహాపాపమండీ ప్రథమ పాదంలోనే!..."అని

హిందువులు తర్కవితర్కాలుచేసుకుని మాట్లాడక ఊరుకున్నారు.

బన్సీ లాలూ సీతా యీకథను నమ్మలేదు. సయీదా సయ్యదును పెళ్లి చేసుకుంటుందంటే కిషన్‌కికూడావిశ్వాసంకలగలేదు. కాని తన వివాహం అయిన కొత్త మోజులో యీవిషయమై అట్టే ఆలోచించలేదు. చదువుకెలాంటి ఆటంకం లేకుండావుండే షరతుమీద సీతకూడా వివాహాని కంగీకరించింది కిందటి నెలే ఆమె పెళ్లికూడా అయింది. బన్సీ భార్యమటుకు "తురకజాతి కాదూ?...తండ్రినిచంపిన వాడైతేనేం ? తల్లితో పోయిన వాడైతేనేం ? మొగాడయితే చాలు ఆడదానికి?..." అని బహు యీసడింపుగా అనేసింది యింట్లో అందరి ముందూ.

సయ్యదు విడుదలైన మర్నాడు సయీదా కాలేజీకి పోవటానికి బండి రాలేదు. నౌకర్నడిగింది. "అయ్యగారు ఒద్దని వెళ్లగొట్టా"రని చెప్పాడు. "ఇంకా చదువెందుకు తల్లీ !...ఏదో నీకు నచ్చిన కుర్రాణ్ని పెళ్ళిచేసుకుని పదిమంది బిడ్డల్నికంటే అదే పదివేలు...సయ్యదునే చేసుకున్నావా మరీ సంతోషం. వారికీ ఆనందంగా వుంటుంది. కాదూ అంటే మరో సంబంధమైనా సరే!..."నని జేబున్నీసా చెప్పింది. సయీదాకు వెర్రు లెత్తుతున్నాయి. సాయంత్రం స్నేహితురాళ్లు రాలేదు. తనేవాళ్లింటికి పోదామని బండి తెమ్మంది నౌకరుతో "బాబుగారి ఆజ్ఞలేందే తమర్ని గడపదాట నియ్యటానికి వీలు లేదమ్మా!" అని నౌకరు చెప్పేశాడు. రాత్రిసయ్యదు గజనీయింట్లోనే భోజనంచేశాడు. మర్నాడు ఉదయం గజనీని అడిగింది "నన్ను చెరలో పెట్టా రేమి ?"టని.

"సయ్యదుని అడుగమ్మా" అని శాంతంతో జవాబు చెప్పాడు గజనీ.

"అయితే నన్ను ఆత్మహత్య చేసు కోమని మీరు ఆదేశించినట్లే కదా ?" అంది సయీదా...

"అబ్బే ! అతన్ని పెళ్లిచేసుకోమని నిన్ను బలవంతపెట్టడం లేదు నేను. ఆవిషయంలో నేను ఓడిపోయాను." అని మెల్లిగా అన్నాడు గజనీ.

"అయితే మరి ఆయన పెత్తనమేమిటి ?" అని ప్రశ్నించింది.

"పెత్తనం ఒచ్చిన నేను యింటిగొడవలు పట్టించుకోనలచుకోలేదు. యిహ ఏదో భగవద్ధ్యానంతో కాలం గడుపుదామని యింటివిషయాలన్ని వాడి మీదే పెట్టేశా. నాకూ వేరే పిల్లా జెల్లా లేదుకదా ? వాడే నాకు సర్వస్వమూను." అని తన ఆధ్యాత్మిక చింతననూ, సయ్యదు మీద గల అపారప్రేమనూ వెలిబుచ్చాడు గజనీ. మారుమాట చెప్పకుండా సయీదా లోపలి కెళ్ళిపోయింది. గజనీ మోసం కొరుకుతూ నుంచున్నాడు ఏమీ అర్థంకాక.

అన్నం సయించకపోయినా రెండు మెతుకులు కొరికి తనగదిలో కెళ్లి పడుకుంది సయీదా. సయ్యద్ ప్రత్యేకం మధ్యాహ్నం గది ముందుకొచ్చి "నీకే మన్నా కావాలా?" అని అడిగాడు. సయీదా, తోటకూరలో పురుగును విదిల్చినట్లుగా విదిలించి "ఏమీఅక్కర్లేదు పోరా !" అందా మనుకుంది కాని "నా క్కావాల్సిన పనిచెయ్యగలవా ? అని ప్రశ్నించింది తన తండ్రి గుండె రక్తంతో అరుణమైన అతని ఆపాదమస్తకాన్ని చూచి సహిస్తూనే. "మహాసంతోషంతో!" అన్నాడు సయ్యద్. ఆమెకు కాస్త విస్మయం కలిగింది.

"ఈబందిఖానాలోంచి బయటకు పోవటానికో బండి తెప్పించు" అంది సయీదా...ఆపని అతడు చెయ్యడని ఆమెకు బాగా నమ్మకమే. "ఎక్కడి కెడతావు?" అని అడిగాడు సయ్యద్.

ఆమెకు సమాధానం కనిపించలేదు. అవును, అసలెక్కడి కెళుతుంది యిప్పుడు ? స్నేహితురాళ్ల యింటికెళ్లినా మళ్లీ యిక్కడికి రావలసిందేగా ? ఆమె ఓడిపోయినట్టూరుకుంది...

"పిచ్చిదానా ! సుఖించడం నేర్చుకో యిప్పుడన్నా...కిషన్ గాడి విషహస్తాల్లో శాశ్వతంగా పడకుండా నిన్ను నువ్వు రక్షించుకున్నావు. నాకు తెలుసు నిన్నతడనుభవించాడని. అయినా నాకు ఫరవాలేదు. మారుమనువులు మనలో వున్నాయి. అదొక నిక్కా అనుకుంటా. మాఅన్నకు పిల్లలులేరు. ఆ ఆస్తీ, నా ఆస్తీ, నీ ఆస్తీ అంతకూ నీవే అధికారిణి వవుతావు. నాకోరికమన్నించు." అంటూ గదిలో కొక అడుగేశాడు. కిషన్‌లాల్ మాట గుర్తుచేసినందు కామె జ్వలితహృదయంలో అమృతబిందు వేసినట్టయింది. క్షణమాత్ర మా ఊప

శమన భావంలో మైమరచి సయ్యద్ చెప్పిన మిగతా మాటలు వినలేదు. ఆమె మౌనం అర్ధాంగీకార సూచ్యమని సయ్యద్ మరి రెండడుగు లేసేసరికి ఆమె ప్రకృతిస్థ అయి రణ చండిక లాగా గుడ్లురిమి చూస్తూ "పితృహంతకా పశువా!! అవతలికిపోరా!!!" అనిగర్జించింది. రోషా రుణాలైన ఆ నేత్రయుగ్మంలోంచి వెడలిన ఉష్ణ కాంతులు నాసికా పుటంనుంచి ఒచ్చిన కవోష్ణనిశ్వాసంతో కలిసి ఆ నాలుగు గజాలూ వాయుయానంచేసి సయ్యద్ హృదయంలో మాయని ముద్ర వేశాయి. ఒదులుగా తొడుక్కున్న సిల్కు చొక్కాలోని డోర్యాలను మాటిమాటికీ కదిలిస్తూ యుద్ధరంగంలోని సైనికులల్లె వక్షోజాలు ముందు వెనక్కు కదులుతూ సయ్యద్‌ను కవ్వించాయి. జారి కింద పడిన ఉత్తరీయాన్ని ఎత్తటానికని వంగినప్పుడు సయీదా సన్న నడుము అతి లావణ్యంగా ఒంపుతిరిగి నమస్సులుచేసిన కుచద్వయాన్నాశీర్వదించి యథాస్థానం జేరింది. కాలనాగ శిశువులవంటి కేశపుంజాలు కోపోద్రేకంతో ఎర్రబడిన కపోలాలను స్పృశించబోతే ఒక్కమాటు తల విదిలించి శిరసావహించింది. సయ్యద్ అంటే వుండే ఏహ్యభావాన్నంతా కోపంలోకి కరిగించి భ్రూమధ్య కుండంలో భద్రపరిచి తీక్ష్ణశరాలు విసురుతున్న సయీదాలోని రౌద్ర శృంగారాన్ని తిలకించి సయ్యద్ మైమరచాడు. అతని వెనకాలే ఒస్తున్న జేబున్నిసానుచూసి "పిన్నిగారూ!" అని బిగ్గరగానే ఏడుస్తూ సయీదా మంచంమీద బోర్లపడిపోయింది. "ఇంత లలిత హృదయ తన కోమల శరీరాన్ని నా గుండెల్లో దాచుకుంటే నేను నా శిరస్సిచ్చి సర్వతాపాలూ ఉపశమింప జేయనూ" అనుకుని జాలిగా చూస్తూ సయ్యద్ వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

జేబున్నిసా ఆమెను చాలాసేపు ఓదార్చి, "సయ్యద్ నిన్ను దుర్భాషలాడాడా? బెదిరించాడా? స్పృశించాడా? బలవంతపరిచాడా?" అని ప్రశ్నించింది. "లే"దని సయీదా తల తిప్పింది. "కాని నిన్నతడు చాలా ఏళ్ళనుంచీ ప్రేమిస్తున్నాడు తల్లీ. నీ సమ్మతి లేనిదే అతడు నిన్ను స్పృశిస్తే పురుగు మాడినట్లు మాడిపోతాడు. నిన్ను వేడుకోటంమటుకు మానడు.'' అంది జేబున్నీసా.

"మా నాన్నని కత్తితో డొక్కలో పొడిచి చంపినట్లు నన్నుకూడా చంపరాదూ పోనీ? ఎందుకూ నన్నిలా చిత్రహింస చెయ్యడం?'' అని ప్రశ్నించింది వెక్కి వెక్కి ఏడుస్తూ సయీదా.

"అటువంటి మాట లనకు తల్లీ. సయ్యద్ హృదయం నీకు తెలీదు. అతను హంతకుడు కాడు..'' అంది జేబున్నిసా హృదయపూర్వకంగా.

వారం రోజులవరకూ సయ్యద్ ఆమె కంట పడలేదు. ఎనిమిదోరోజు సాయంత్రం మేడవెనక మల్లెమొక్కలమధ్య పాలరాతి అరుగుమీద సయీదా కూర్చుని వుండగా సయ్యద్ ఒచ్చాడు. దూరాన్నుంచే సయీదా అతని వాలకం చూస్తోంది. పరమపవిత్రునివంటి ఆ ముఖవైఖరిలో హంతక ప్రవృత్తెక్కడా కనిపించలేదు నిజంగా సయీదాకు.

"దొంగ సంతకాలుపెట్టి నీ డబ్బంతా బ్యాంకులోంచి తీసేశాడు మా అన్నయ్య. "అది న్యాయం కాద''ని నేనంటే నన్ను నానా చివాట్లేశాడు. నా డబ్బు యిదిగో తీసుకో బ్యాంకులో నీకున్న రొఖ్ఖ బదులు...'' అంటూ వందరూపాయల నోట్ల కట్టలు చాలా ఆమెముందు పెట్టాడు, సయ్యద్. "హంతకుని డబ్బు నా కక్కర్లేదు.'' అని సయీదా ఆ నోట్ల కట్టలన్నీ దూరంగా తోసేసింది.

"నేను హంతకుణ్ణి కాదు సయిదా...'' అన్నాడు బహు దీనంగా...

"నా తండ్రిని చంపలేదా నువ్వు?" అని ప్రశ్నించింది సయీదా...

"నీకోసం ...'' అన్నాడు హృదయాన్ని విప్పుతూ సయ్యద్.

"ఆయన్ని చంపినవాళ్ళకి నిన్నిచ్చి పెళ్ళి చేస్తానన్నాడు మా అన్నయ్య. నిన్ను పొందటానికిగాను ప్రాణానికి తెగించి హత్యచేశా. నిన్ను పొందలేకపోతే నేను ప్రాణత్యాగమే చేస్తాను...నీ హృదయంలో నాకు...'' అర్ధోక్తిలోనే సయీదా విదిలించి కొడు పితృహంతకుని పెళ్ళాడే నీచురాలు కాదు సయీదా'' అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

"గజనీకంటె సయ్యద్ చాలా మంచివాడు. గజనీ దొంగదోపిడిగాడు, మోసగాడు, ధూర్తుడు.

నన్నే కాదు. తన తమ్ముణ్ణే వంచించి అతనిచేత హత్య చేయించాడు. తన డబ్బంతా కాజేశాడు... తను బుద్ధిపూర్వకంగా బన్సీ మామయ్యను రెచ్చగొట్టి పూలతోటలోంచి భుగభుగామం డేపాయిలో కొచ్చి పడింది. అవును. "నా కోడల్ని నేనుమటుకు సయీదా అనే అంటాననేసరికి తన కవమానమే కలిగింది. నిజానికి మేనకోడలనే భావంలోనే అన్నాడేమో! మరి కిషన్ తోటలో ఎందు కలా తనని కౌగిలించుకుని ముద్దెట్టుకున్నాడు? అతని తండ్రి కిష్టమేనని పొద్దున మాటలవల్లనే తెలిసిందిట. తన కిష్టమేనని తనకి తెలియనే తెలుసుట. మరి తన తండ్రి యిష్టమూ, తన యిష్టమూ తెలుసుకోవద్దూ? అందులోనూ పితృమరణంతో కుమిలిపోతున్న తనను బలవంతాన కౌగిలించుకుని...నిజానికి తనుమాత్రం కిషన్‌ను ప్రేమించలేదూ? మరణించిన తన తండ్రి ఏమనేవాడో యిప్పుడెలా తెలుస్తుంది? ఒకటి రెండు ముస్లిం సంబంధాలొస్తే బాగుండలేదని ఒద్దన్నాడేగాని కిషన్‌కే తన నిద్దామని ఎప్పుడన్నా చూఛాయగానన్నా అన్నాడా? ఒకవేళ బన్సీ మామయ్యతో అన్నాడేమో!! ఏకాకినైన నన్ను బలవంతం చేసయినా సరే తమవశం చేసుకుందామని బన్సీ మామయ్య కుటుంబమంతా కుట్రపన్నికదూ తన్నలా అవమానించింది? అత్తయ్యకుమటుకు తనని కొడుకు ఉంపుడుకత్తెగా చెయ్యాలనే ఉద్దేశం. పాపం సీత ఎంత జాలిపడింది నేను ఏడుస్తూ చెప్పినప్పుడు? నిజానికి కిషన్‌తో "నాన్నపోయి ఏడుస్తున్న యీ రోజుల్లో పెళ్లిమాటలెందుకు కిషన్?" అంటే ఊరుకోడూ?... ముందు యీమాటలన్నీ చెపితే బన్సీమామ కిషన్‌నే కోప్పడేవాడు. తర్వాత ప్రాప్తివుంటే తమ యిద్దరి వివాహమూ జరిగేదేమో! అయినా మతం అడ్డంరాదూ? తనూ హిందూమతం గ్రహించేదేమో! పదిమందిలోనూ చెప్పినట్లు! ఇప్పుడేమనుకుంటే ఏం లాభం? తను మాత్రం అంత పెద్ద మనిషి బన్సీతో అంత నిర్లక్ష్యంగా మాట్లాడటం న్యాయమా...ఒచ్చేటప్పుడు సీతతో నన్నా చెప్పిఒస్తే బాగుండేది! పోనీ వాళ్ళకేమీ దురభిప్రాయాలు లేకపోతే ఓమాటు యిక్కడికొచ్చి!! ఛీ! ఛీ!! ఛీ!!! తనొచ్చి యిరుక్కుచస్తోంది కాక వాళ్లుకూడా రావాలనుకోవటమేమిటి!!"

ఆరాత్రి సయీదాకు పైతలంపులన్నీ పొర్లుకు రావడంచేత చాలాసేపటివరకు నిద్రపట్టలేదు. పితృమరణదుఃఖం క్రమంగా వెనకపడ్డకొద్దీ తనభావి జీవనసమస్య కారుమేఘాలై కమ్ముకుంటుంటే, కిషన్ యందు తనకుగల ప్రేమ తటిల్లతలాగా మెరిసి గిలిగింతలు పెట్టేది. పాపం చాలాసేపు ఏడ్చి ఏడ్చి సొమ్మసిలి నిద్రాదేవికౌగిలిలో కెప్పుడో తెల్లారుఝామున వెళ్ళింది.

అలాగే మరికొన్ని నెలలు గడిచాయి. ఆనాటికానాటికి సయ్యద్ తన హృదయానికి దగ్గిరిగా ఒస్తున్నట్లు సయీదా తెలుసుకుని ప్రయత్నపూర్వకంగా ఏవగించుకుని దూరంగా కొట్టేసేది. మళ్లీ హోళికాపూర్ణిమ ఒచ్చింది. తండ్రిమరణం మాటలు తల్చుకుని మరోమారు ఏడ్చి "పూర్ణిమ అని పేరు మారిస్తే బాగుంటుంది" అని సీత అనడం" "అవును హోళికాపూర్ణిమ అనచ్చు కూడాను" అని కిషన్‌లాల్ అనడం" "నేను మాత్రం సయీదా అనే అంటాను నా కోడల్ని" అని బన్సీలాల్ అనడం గుర్తుతెచ్చుకుని కిషన్ అన్నమాటలు ఆమె ఒళ్లు పులకరింపజేయగా ఉద్రేకంతో ఊపిరి విడుస్తూ అలాగే మంచంమీద పడుకుని నిద్రపోయింది గది తలుపు వేసుకోటంకూడా మరిచిపోయి ఆరాత్రి.

పన్నెండుగంటలవేళ సయ్యద్ సరాసరి ఆమె గదిలోకొచ్చాడు. జేబున్నిసా తనగదిలో పడుకుని నిద్రపోతోంది. చవితినాడు బలవంతానైనా సయీదా వివాహంచేయ నిశ్చయించానని గజనీ అంతకుముందే చెప్పాడు సయ్యద్‌తో.

వివాహం బలాత్కారంగాచేసినా ఏమీ ప్రయోజనం వుండదని సయ్యద్ ఎంతచెప్పినా వినలేదు గజనీ. ఆ విషయం సయీదాతో చెప్పటానికే అంత రాత్రివేళ ఒచ్చాడు. గదిలో దీపం లేదు.

నిద్రిస్తున్న ఆ అప్సరస సయ్యదును సమ్మోహితుణ్ని చేసింది. కిటికీలోంచి ఒస్తున్న పున్నమ చంద్రుని యవ్వనకిరణాలు సయీదా నుదురునిముద్దు పెట్టుకుని అర్ధాచ్ఛాదన చేస్తున్న కంచుకంలోంచి

లోపలికిమారి హృదయాన్ని కౌగలించుకుంటానికి పాకుతూ ప్రయత్నిస్తున్నాయి. జాజివాసనలను మోసుకొస్తూపిల్ల తెమ్మెరలు మొహంతోదాగుడుమూతలాడుతున్న ముంగురులకు చక్కిలిగింతలు పెడుతున్నాయి. సుఖస్వప్నమేదో కంటున్నదో ఏమో అరుణాధరంమీద మృదుహాసరేఖ తళుక్కుమంది. పాలుకారే నున్నటి చెక్కిళ్లసువర్ణచ్ఛాయ వెన్నెల మిసమిసతో పోట్లాడి పారదోలుతోంది. తలకింద వున్న పద్మాలవంటి అరచేతుల అరుణిమ మణికట్లవరకూ ఎగబాకింది. నిరాచ్ఛాదితమైన భుజముల స్నిగ్ధత్వాన్ని జాజిమొగ్గల నీడలూ, వెన్నెల వెలుగులో పోటీలుపడి మరింత ఆకర్షవంతం చేస్తున్నాయి. ఎడమకాలు మంచంమీదనుంచి కిందికి వేలాడటంవల్లకుడికాలిమీది పరికిణీ మోకాలు దాటినడిచింది. ఓణీ పృథక్శయ్య నలంకరించినట్లు పక్కమీద పడుంది.

సయ్యాద్‌చోరుడివలె పదినిముషాలు సుందర శృంగారశోభను తిలకిస్తూ నుంచున్నాడు. సయీదా తనదికాలేదు. కాబోదుకూడాను. గజనీ బలవంతాన పెళ్లిచేసి తీరుతాడు. ఆమె బతికుంటే పెళ్ళిలోపుగానో పెళ్ళయిన వెంటనో ఆమె ఆత్మహత్య చేసుకోటం తథ్యం. తత్కారణంగా తన బ్రతుకూ పూర్తయినట్లే. ఈసుందరి అధరాన్నన్నా తను దొంగతనంగా చుంబించగల డిప్పుడు. ఆమె యిష్టం లేకుండా స్పృశిస్తే పురుగుమూడినట్లు మాడిపోతావని వదినగారు శాపమే పెట్టింది. మరణించేముందు ఆ స్వర్గసుఖపు అంచులు స్పృశించి అయినా మాడిపోతా" నని దృఢపరుచుకుని ఒక్కమాటు బాకు సరిచూచుకుంటూ సయీదా మీదపడి బిగియార కౌగలించుకుని ఆమె అరవటానికన్నా వీలులేకుండా అధరాన్ని గాఢంగా చుంబించాడు సయ్యాద్. ఆమె ఉలిక్కిపడి కళ్లుతెరచి క్షణమాత్రంలో సర్వమూ గ్రహించి సయ్యాద్ పెదిమను నెత్తురుకాలవలయేట్లు కొరికి చేతులతోనూ, కాళ్ళతోనూ విదిలించి నెట్టేసింది. నెత్తురుకారుతున్న పెదిమతోనే మందహాసం చేసి బాకుతీసి సయీదాకందిస్తూ నీహృదయాన్ని నేను పొందలేకపోయా. నీమానాన్నినే నపహరించ దలచలేదు. నీ అధరాన్ని దొంగతనంగా చుంబించి నీదంతక్షత సుఖం అనుభవించా చాలు నాజీవితానికి. ఈ బాకుతో నన్ను పొడిచేసెయ్యి. నిరుడు మీ నాన్నని నేను పొడిచి చంపినట్లు అన్నాడు సయీదా. తలాపి దిక్కునఉన్న తనబాకుతీసి తన గుండెలమీద పెట్టుకుంది. సయ్యాద్ తనబాకు తన కంఠంమీద పెట్టుకున్నాడు. ఆమె ఆశ్చర్యంతో లేచి నుంచుంది. సయ్యాద్ చెప్పాడు "గజనీ నీకూ, నాకూ చవితినాడు పెళ్ళిచేసి తీరుతాడట. నాకుతెలుసు యీ లోగానే నువ్వు ఆత్మహత్య చేసుకుంటావని. ఆ తరవాత నేనూ బతకను. నీకళ్ళముందే నాపనీ, నాకళ్ళముందే నీపనీ అయిపోతే అదికూడా నాకు సుఖమే" నని. సయీదా బాకు విసిరి గోడమీదికి కొట్టింది. సయ్యాద్ ఆ బాకుతీసుకుని వెళ్ళిపోయాడు.

ప్రాణత్యాగం చెయ్యడం తేలికేగాని. చనిపోయేముందు సీతకోమాటు కనపడాలి. బన్సీలాలూ, కిషనూ అంతా కనిపిస్తే కనిపిస్తారోమాటు. అక్కడికి రాత్రేవెళ్ళటం మంచిది. రేపటినుంచీ ఎన్నిపహారాలు పెడుతాడో గజనీ! సయ్యాద్ హృదయం తనను మాటిమాటికీ ప్రశ్నిస్తోంది... జవాబేమీ చెప్పలేక పోతోంది తను. గడియారం రెండుగంటలు కొట్టింది. గదితలుపు లోపలేసుకుని కిటికీపైని అద్దాలు పగలకొట్టి దానిగుండా బయటికొచ్చి దొడ్డివేపు గోడదాటి రోడ్డుమీదికి దూకింది. అదృష్టవశాత్తు చంద్రుణ్ణి ఓ నల్లమబ్బు కప్పెయ్యడంవల్ల చీకటిచాటున రోడ్డుమలుపుతిరిగేసరికి ఒక గుర్రబ్బండి కనిపించింది. తన బంగారు గాజుల జత ఒకటా బండిమనిషికిచ్చి బన్సీలాలింటికి రహస్యంగా తీసుకెళ్ళమంది. దార్లో బండివాడు చెప్పాడు బన్సీలాలు మరణించి యివాళిటికి 12 రోజులయిందని. సయీదా ఎక్కెక్కేడుస్తూ తెల్లారుఝాముకు బన్సీలాల్ గృహంచేరింది. నౌకరామెను గుర్తుపట్టి లోపలికి తీసుకెళ్ళాడు. మొదట్లోనే సీత కనిపించింది. ఆమె కారోనెల. కొంచెం వికారం ఒస్తే ఉమ్మేద్దామని బయటికొచ్చింది. సయీదాను గుర్తుపట్టి కౌగలించుకుంది. ఒకటే ఏడవటం యిద్దరూను. బాగా తెల్లారేదాకా ఏడుస్తూనే సయీదా తన ఏడాది కథా చెప్పేసింది. సీతకూడా

తను చెప్పాల్సినదంతా చెప్పింది. తెల్లారి కిషన్ సయీదాను చూసి తెల్లబోయాడు. అతని భార్య పురిటికి పుట్టింటి కెళ్ళింది. బన్సీ భార్య సయీదాను చూసి మొహం చిట్లించుకుంది.

స్నానసంధ్య లయింతర్వాత కిషన్‌లాలు సీలువేసిన ఒక పెద్దకవరు తెచ్చి సయీదాకిచ్చాడు. దానిమీద బన్సీలాలు సంతకంతో "దానిని సయీదాకు స్వయంగా కిషన్‌లాలివ్వాలి. అలా వీలుకాక పోతే ఊరుకోవాలి." అని రాసివుంది. సయీదాకీ ఆశ్చర్యంగానేవుంది. ఆ కవరు ఇనప్పెట్టెలో వుందట! సయీదాకవరు చింపేసరికి దాంట్లో ఓ ఉత్తరం వుంది. "నా తొందరపాటుకిదో జరిమానా. ఎప్పటికైనా కిషనూ, నువ్వూ కలిసి కాపరం చెయ్యాలని నేననుకునేవాణ్ని. కాని భగవంతుడన్యథా తలిచాడు." అనివుంది దాంట్లో. సీతా, కిషనూ సాశ్చర్యంగా సయీదావేపు చూశారు. ఆమె గంభీర ముద్రదాల్చి పెద్దకవరులోవున్న రెండోకవరు చింపింది. వెయ్యిరూపాయలనోట్లు వందవున్నాయి, సయీదా వెక్కి వెక్కి ఏడ్చింది.

